



ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికలపై గురి

బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాల్లో పాగా వేసేందుకు కాంగ్రెస్ కసరత్తు

- బీఆర్ఎస్, బీజేపీలకు ఏ ఎన్నికల్లో చాన్స్ ఇవ్వకుండా ఎత్తుగడలు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులైన ఓటర్లను చేర్పించే బాధ్యతలు ఎమ్మెల్యేలకు
- మంత్రులు కొండా, పొంగులేటికి వరంగల్, మహబూబాబాద్ స్థానాల బాధ్యతలు
- ఉమ్మడి వరంగల్‌పై ప్రత్యేక దృష్టిపెట్టిన కాంగ్రెస్ అధిష్ఠానం

వరంగల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీ తొలి సవాల్‌కు సిద్ధమవుతోంది. బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాల్లో పాగా వేసేందుకు కాంగ్రెస్ పావులు కదుపుతోంది. నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఉప ఎన్నికలతో పాటు పార్లమెంట్ ఎన్నికలపై దృష్టిపెట్టింది. ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలకు ఏ ఎన్నికల్లో గెలిచే అవకాశం ఇవ్వకూడదని వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. పార్లమెంట్ స్థానాలకు మంత్రులను ఇంచార్జులుగా నియమించడంతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులైన ఓటర్లను చేర్పించే బాధ్యతలను ఎమ్మెల్యేలకు, కీలక నేతలకు అప్పగించింది. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో విజయంపై సమీక్షలు నిర్వహిస్తు పార్టీ పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. దీంతో ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ భారీ కసరత్తు చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

ఎంపీ సీట్లపైనే హస్తం ఫోకస్

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు మొదలు పెట్టింది. రాష్ట్రంలో 17 ఎంపీ సీట్లు ఉండగా, కనీసం 12 స్థానాలైన గెలువాలని ఏఐసీసీ నుంచి ఆదేశాలు ఉన్నాయి. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాలైన వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ తీవ్రంగా కసరత్తు చేస్తుంది. ఇప్పటికే వరంగల్ పార్లమెంట్ ఇంచార్జీగా మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ పార్లమెంట్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలను కాంగ్రెస్ అధిష్ఠానం నియమించింది. ఇటీవల స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికలపై హైదరాబాద్‌లో సమీక్ష కూడా నిర్వహించారు. రెండు ఎంపీ స్థానాలను గెలుచుకునేలా వ్యూహాలు రూపొందించాలని మంత్రులకు సీఎం సూచించారు.

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, కేవలం స్టేషన్‌ఘన్‌పూర్‌లోనే బీఆర్ఎస్ విజయం సాధించింది. మిగతా ఆరు స్థానాలు కాంగ్రెస్ ఖాతాలోనే ఉన్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 6,63,556 ఓట్లు పొందగా, బీఆర్ఎస్‌కు 4,33,368 ఓట్లు, బీజేపీకి 1,56,638 ఓట్లు పోలయ్యాయి. వరంగల్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్‌కు 2,41,987 ఓట్ల ఆధిక్యం లభించింది. దీంతో ఈసారి వరంగల్ ఎంపీ సెగ్మెంట్‌లో పాగా వేయడం పెద్ద కష్టం కాదనే ధీమాలో కాంగ్రెస్ పార్టీ ఉంది.

అలాగే మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, భద్రాద్రికొత్తగూడెం జిల్లా భద్రాచలం అసెంబ్లీ సెగ్మెంట్‌లో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. ఇక్కడ కూడా కాంగ్రెస్ పార్టీకి 6,85,897 ఓట్లను పొందగా, బీఆర్ఎస్‌కు 4,43,910 ఓట్లు పోలయ్యాయి. ఇక బీజేపీకి కేవలం 34,431 ఓట్లు మాత్రమే లభించాయి. ఈ ఎంపీ సెగ్మెంట్‌లో కాంగ్రెస్‌కు 2,30,188 ఓట్ల ఆధిక్యత లభించింది. దీంతో ఈ రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలో కాంగ్రెస్‌కు భారీగా ఓటు బ్యాంకు పెరగడంతో ఎంపీ ఎన్నికల్లో గెలుపై ధీమాగా ఉంది. మహబూబాబాద్ ఎంపీ స్థానంలో బీఆర్ఎస్‌తో ముఖాముఖి పోటీ ఉండే అవకాశం ఉందని కాంగ్రెస్ భావిస్తుంది.

అయితే వరంగల్ పార్లమెంట్ పరిధిలోని పరకాల, వరంగల్‌తూర్పు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లో బీజేపీ కొంత ప్రభావం చూపించింది. దీంతో వరంగల్ ఎంపీ స్థానంలో త్రిముఖ పోటీ జరిగే అవకాశం ఉందని కాంగ్రెస్ భావిస్తుంది. దీంతో బలమైన అభ్యర్థిని బరిలోకి దింపేందుకు ప్రయత్నిస్తుంది. అయితే పొత్తులో భాగంగా వరంగల్ సీటును సీపీఐ కూడా అడుగుతుంది. అయితే దీనిపై ఎలాంటి స్పష్టత లేకున్నప్పటికీ రెండు ఎంపీ సీట్లను మాత్రం పక్కాగా గెలుచుకోవాలని కాంగ్రెస్ కసరత్తు చేస్తుంది.

అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల వారీగా పోలైన ఓట్లు

నియోజకవర్గం	అసెంబ్లీ నియోజకవర్గాలు	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
వరంగల్	07	6,63,556	4,33,368	1,56,638
మహబూబాబాద్	07	6,85,897	4,43,910	34,431

కాంగ్రెస్‌కు తొలి సవాల్...

గత ఏడాది డిసెంబరు 7వ తేదీన కొలువుదీరిన కాంగ్రెస్ పార్టీ తొలి సవాల్ ఎదుర్కొనుంది. ఇటీవల సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల్లో తన మిత్రపక్షం సీపీఐతో కలిసి కాంగ్రెస్ క్లీన్‌స్వీప్ చేసింది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ అనుబంధ సంఘాలు జాడ లేకుండా పోయాయి. అయితే ఇది ఒక వర్గానికి సంబంధించిన ఎన్నికలే కావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోలేదు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇప్పటికే రెండు హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వం ఫిబ్రవరిలో మరో హామీని కూడా అమలు చేసేందుకు కసరత్తు పూర్తి చేసింది. మార్చి, ఏప్రిల్ నాటికి మిగతా రెండు హామీలను కూడా అమలు చేసి పార్లమెంట్ ఎన్నికలకు వెళ్లాలనే యోచనలో కాంగ్రెస్ ఉంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో గెలుపుతో పాటు ఉమ్మడి వరంగల్‌లోని రెండు పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలు ఇచ్చే తీర్పు ఇదే కావటంతో ఈ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గా మారాయి.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికపై...

జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిసెంబరు 9న ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా చేసిన ఆరు నెలల్లోగా ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉండటంతో జూన్ 8వ తేదీ వరకు ఉప ఎన్నికకు గడువుంది. ఏప్రిల్, మే నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండటంతో ఏప్రిల్ నెల లేదంటే జూన్ మొదటి వారంలోనే ఎమ్మెల్సీ పదవికి ఉప ఎన్నిక నిర్వహించనున్నారు. కాగా, నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికల్లో ఖచ్చితంగా గెలువాలని కాంగ్రెస్ టార్గెట్ పెట్టుకుంది. శాసనమండలిలో కాంగ్రెస్‌కు మెజార్టీ లేకపోవటంతో ప్రతి ఎమ్మెల్సీ ఎన్నిక ఆ పార్టీకి సవాల్‌గా మారింది. దీంతో నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది.

2007లో ఈ నియోజకవర్గం ఏర్పడగా, అప్పటి నుంచి జరిగిన మూడు ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు. 2021 ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాములునాయక్



▸▸ మిగతా 7వ పేజీలో..

ప్రజా సమస్యలపై స్పందించాలి

భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 29: ప్రజా సమస్యలపై అధికారులు సత్వరంగా స్పందించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. సమీకృత కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన వినతులు స్వీకరించారు. వాటిపై ఆయా శాఖల అధికారులతో మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన వినతులను ప్రాధాన్యక్రమంలో పరిష్కరించాలన్నారు. వినతుల్లో ప్రజలు పేర్కొన్న సమస్యల పరిష్కారానికి సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని వారికి అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వినతులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 33 వినతులు వచ్చాయి. ఈకార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులు భయపడొద్దు

భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే



ప్రజాదివస్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జనవరి 29: బాధితులెవరైనా భయపడకుండా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తమ సమస్యలను తెలియజేయాలని భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పజా దివస్ కార్యక్రమంలో ఆయన బాధితుల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన వారి సమస్యలను ఆలకించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. బాధితులకు అండగా ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. వివిధ సమస్యలపై 14 మంది ఫిర్యాదులు, వినతులు అందజేశారని, త్వరితగతిన విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులను ఆదేశించారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



నందిని (ఫైల్)

కాటారం, జనవరి 29: ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని దామెరకుంటలో చోటుచేసుకుంది. కాటారం ఎస్సై అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం.. దామరకుంట గ్రామానికి చెందిన సమ్మయ్య, లక్ష్మి దంపతుల కుమార్తె జిల్లెల్ల నందిని(17) భూపాలపల్లిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. కొన్ని రోజులుగా ఆమె తీవ్ర కడుపునొప్పితో బాధపడుతోంది. వైద్యం చేయించినా నయం కాలేదు.

దీంతో జీవితంపై విరక్తి కలిగి ఈనెల 24న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అస్వస్థతకు గురైంది. కొద్ది సేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించి మహదేవపూర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి డాక్టర్ల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అందుతున్న క్రమంలో ఆదివారం రాత్రి నందిని మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. నందిని తల్లిదండ్రులు లక్ష్మి, సమ్మయ్య కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు కాగా నందిని రెండో సంతానం.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 29 : జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని అన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 3,925 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలు రాసేందుకు ఎనిమిది సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్దా వైద్య సిబ్బందితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష సెంటర్లల్లో మాస్ కాపీయింగ్, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ పటిష్ఠ బందోబస్తును కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంచాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డీపీఆర్వో శ్రీధర్, డీఈవో రాంకుమార్, డీఎంహెచ్‌వో మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీటీఎఫ్ నేతలు

కాటారం, జనవరి 29: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన డీటీఎఫ్ మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంఘం రూపొందించిన క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం మేధావులు, అధికారులు, ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం సమావేశమై చర్చించాలన్నారు. జీవో 317తో ఇబ్బందులు పడ్డ ఉపాధ్యాయులకు తగిన న్యాయం చేయాలన్నారు. సబ్జెక్టు టీచర్లు లేని పాఠశాలల్లో డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకు తాత్కాలికంగా విద్యావలంటీర్లను నియమించాలని కోరారు. పీఆర్సీ డీఏల ఎరియర్స్ చెల్లించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, మండల అధ్యక్షుడు రాజేశం, రాష్ట్ర కౌన్సిలర్లు బోజ్యానాయక్, కరుణాకర్‌రావు, లక్ష్మణ్‌నాయక్, సంఘం జిల్లాల, మండల నేతలు సుదర్శన్, సంజీవరెడ్డి, భాగ్యలక్ష్మి, గణపతినాయక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో భక్తుల సందడి

ముందస్తుగా మొక్కులు చెల్లించుకున్న 20 వేల మంది

మేడారం, జనవరి 29 : తాడ్వాయి మండలం మేడారంలో భక్తుల సందడి నెలకొంది. వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు సోమవారం భారీ సంఖ్యలో తరలివచ్చి మహాజాతరకు ముందుగానే వనదేవతలను దర్శించుకున్నారు. సుమారు 20 వేల మంది సమ్మక్క, సారలమ్మల సన్నిధిలో మొక్కులు చెల్లించుకున్నారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు. మేడారం చేరుకున్న భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. వనదేవతల గద్దెలకు చేరుకొని అమ్మవార్లకు పూలు, పండ్లు, పసుపు కుంకుమ, చీరె, సారెలు, కొబ్బరికాయలు, నిలువెత్తు బంగారం(బెల్లం)తో మొక్కులు చెల్లించుకున్నారు.



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

ప్రసాదం లేకుండానే...

మహా జాతరకు ముందస్తుగా మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులకు ప్రసాదం దక్కడం లేదు. దూర ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా తరలివచ్చి తల్లులను దర్శించుకుంటున్న తమకు నిరాశే ఎదురవుతోందని భక్తులు అంటున్నారు. వనదేవతలకు గద్దెల వద్ద బంగారం (బెల్లం) సమర్పించిన అనంతరం దానిని ప్రసాదంగా అందించాల్సి ఉండగా పూజారులు తమకు ఇవ్వడం లేదని అంటున్నారు. భక్తిశ్రద్ధలతో తల్లులకు పూజలు చేసిన అనంతరం ప్రసాదం లేకుండానే తిరిగి వెళ్తున్నామని తెలిపారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

మేడారం, జనవరి 29 : మహాజాతరకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధిఆరులను ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ఐటీడీఏ పీవో అంకిత్‌తో కలిసి ఆమె సోమవారం మేడారంలో పర్యటించారు. గద్దెల పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. ఇంకొన్ని రోజుల్లోనే మహాజాతర జరగనుందని, పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ఆమె వెంట ఐటీడీఏ ఏపీవో వసంతరావు, డీపీవో వెంకయ్య, ఐటీడీఏ ఎస్‌వో రాజ్‌కుమార్, తాడ్వాయి తహసీల్దార్ రవీందర్ తదితరులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కలెక్టరేట్ వద్ద విద్యార్థుల ధర్నా

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

మెస్‌చార్జీలు, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని

ములుగు కలెక్టరేట్, జనవరి 29: కలెక్టరేట్ ఎదుట విద్యార్థులు సోమవారం ధర్నా చేశారు. సంక్షేమ హాస్టళ్లల్లో పెండింగ్‌లో ఉన్న మెస్‌చార్జీలు, స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. ఈసందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి టి.ఎల్.రవి రవి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు గత ఏడాది మార్చి నుంచి ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా విడుదల కాలేదన్నారు. మెస్ చార్జీలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదని అన్నారు. మరో రెండు నెలల్లో పదోతరగతి, ఇంటర్ వార్షిక పరీక్షలు జరగనున్న నేపథ్యంలో నాణ్యమైన పౌష్టికాహారం అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని కఅందజేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సిరిసిల్ల జీవన్, స్వామి, బాలు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కేటీఆర్‌కు మతి భ్రమించింది..

టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు కిరణ్

కాకతీయఖని, జనవరి 29: ప్రొఫెసర్ కోదండరాంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మతి భ్రమించిందని తెలంగాణ జన సమితి భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రత్నం కిరణ్ విమర్శించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని దోచు కుతిన్న కల్వకుంట్ల కుటుంబం అధికారాన్ని కోల్పోవడాన్ని జీర్ణించుకోలేకపోతోందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర సాధన లో ఉద్యమకారులు కీలకపాత్ర పోషించారని, వారికి కాంగ్రెస్ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించి గౌరవిస్తోం దని పేర్కొన్నారు. ఉద్యమకారుల త్యాగాన్ని బీఆర్ఎస్ విస్మరించిందని దుయ్యబట్టారు. కోదండరాం ఎమ్మెల్సీ కావడాన్ని తట్టుకోలేని కేటీఆర్ అవాకులు చెవాకులు పలుకుతున్నారని విమర్శించారు. పదేళ్ల కాలంలో కల్వ కుంట్ల కుటుంబం ప్రజల సొమ్ముతో రాజభోగాలు అను భించి ఆస్తులు కూడబెట్టుకుందని ఆరోపించింది. బీఆర్ఎస్ హయాంలో ఎందరో సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారనే విషయాన్ని ఆ పార్టీ మరచిపోవద్దని పేర్కొన్నారు. ఇప్పుడు సర్పంచుల సమస్యలపై పోరాడాతమనడం విడ్డూరమని వ్యాఖ్యానించారు.

టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర కార్యవర్గంలో

భూపాలపల్లి వాసులకు చోటు



రఘు కుమార్

భూపాలపల్లిటౌన్, జనవరి 29: తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) రాష్ట్ర కార్యవర్గంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా వాసులకు చోటు దక్కింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నలుమాసుల రఘు కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా నామని శంకర్, బండం రాజిరెడ్డిని నియమించారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రఘు, శంకర్‌ను జిల్లా అధ్యక్షుడు పెండెం మధుసూదన్, ఇతర సభ్యులు అభినందించారు.

మానుకోట నుంచి పోటీ చేస్తా..

మాజీ కేంద్ర మంత్రి బలరాం నాయక్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కేంద్ర మంత్రి బలరాంనాయక్

ములుగు, జనవరి 29: మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా తానే పోటీలో ఉంటానని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనకు ఈ మేరకు హామీ ఇచ్చారని మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాంనాయక్ అన్నారు. ములుగు జిల్లాలో ఆయన సోమవారం పర్యటించారు. ములుగులో కాంగ్రెస్ ముఖ్య నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. రెండురోజుల క్రితం సీఎంతో భేటీ అయ్యానని, గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పనిచేసుకోవాలని ఆయన సూచించారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని అన్నారు. ఆరు గ్యారెంటీ పథకాల్లో ఇప్పటికే రెండు విజయవంతంగా అమలవుతున్నాయని అన్నారు. మిగిలిన నాలుగు కూడా త్వరలోనే ప్రజలకు చేరువవుతాయని తెలిపారు. కాంగ్రెస్ అంటేనే ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే పార్టీ అన్నారు. అధికారం కోల్పోవడాన్ని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్‌గౌడ్, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లాడి రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, ములుగు పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, గోవిందరావుపేట మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, కాసిందేవిపేట సర్పంచ్ ఎమ్డీ.అహ్మద్‌పాషా, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అన్నారం ఉర్సు


దర్గాలో పూజలు చేస్తున్న ముజావర్లు

పర్వతగిరి, జనవరి 29: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మండలంలోని అన్నారం షరీఫ్ దర్గా ఉర్సు ఉత్సవాలు చివరి రోజైన సోమవారం ముగిసాయి. మూడు రోజులుగా నిర్వహించిన వేడుకల్లో చివరి రోజు ఖత్మల్ ఖురానా (ఖురాన్ పఠనం)తో ముగిసాయి. ఉర్సు ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్‌పాషా తెలిపారు. ఉత్సవాల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా 70 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపట్టినట్లు ఎస్సై వీరభద్రరావు తెలిపారు.

పరిశోధన విద్యార్థులకు ఫెల్లోషిప్ ఇవ్వాలి

మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు స్కాలర్స్ వినతి


మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు వినతి పత్రాన్ని ఇస్తున్న కుర్సా అధ్యక్షుడు ఉషన్‌నాయక్, ప్రశాంత్

కేయూ క్యాంపస్, జనవరి 29 : రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీల్లో పరిశోధన చేస్తున్న పీహెచ్‌డీ విద్యార్థులకు ఫెల్లోషిప్ ఇప్పించాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కలిసి కేయూ పరిశోధకుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఉషన్‌నాయక్, కళ్లెపల్లి ప్రశాంత్‌ల నేతృత్వంలో సోమవారం వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఉషన్‌నాయక్, ప్రశాంత్‌లు మాట్లాడుతూ..వర్సిటీల పరిశోధన విద్యార్థులకు ఫెల్లోషిప్ ఇవ్వాలన్నారు. పరిశోధనల్లో నాణ్యతకు ఫెల్లోషిప్‌లు దోహదపడుతాయని అన్నారు. ఒడిస్సా, యూపీ రాష్ట్ర ప్రభుత్వాలు సీఎం రిసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ పథకం క్రింద ఫెల్లోషిప్‌లు ఇస్తున్నాయని తెలిపారు. దీనిపై మంత్రి స్పందిస్తూ సీఎం దృష్టికి విషయాన్ని తీసుకెళ్ళి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కుర్సా నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుర్సా జనరల్ సెక్రటరీ కళ్లెపల్లి ప్రశాంత్, వైస్ ప్రెసిడెంట్ జానకి రామ్, కోశాధికారి అంగడి సతీశ్, ఈసీ మెంబర్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలి

తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చుక్కయ్య


మాట్లాడుతున్న చుక్కయ్య

ఐనవోలు, జనవరి 29: హనుమకొండ ఫాతిమానగర్‌లో నిర్వహించనున్న సీఐటీయూ జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. చుక్కయ్య, సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్యలు పిలుపునిచ్చారు. సోమవారం ఐనవోలులో జరిగిన ప్రజాసంఘాల సమావేశంలో వారు మాట్లాడుతూ సీఐటీయూ జాతీయ సమావేశాలు ఈ నెల 31, ఫిబ్రవరి 1, 2 తేదీలలో ఫాతిమానగర్ బాలవికాస్‌లో జరుగుతాయని తెలిపారు.

ఈ సమావేశాల్లో కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానలపై చర్చించి భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేస్తారన్నారు. 31న బహిరంగ సభ ఉంటుందని వేయిస్తంభాల ఆలయం నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు భారీ కార్మిక ర్యాలీ జరుగుతుందన్నారు. ఈసమావేశాల్లో బీవీ రాఘవులు, సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు హేమలత, తపన్‌సేన, ప్రముఖులు హజరుకానున్నట్లు తెలిపారు. బహిరంగసభకు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కేఎస్ రెడ్డి, ఉప్పలయ్య, నాగరాజు, కుసుంబ దేవేందర్, నర్సయ్య, కొమురయ్య, మేకిరి మోహన్‌రావు తదతరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేయూ వీసీ ఆచార్య రమేశ్

మరణ సందేశం పుస్తకావిష్కరణ

వడ్డెపల్లి, జనవరి 29: సీనియర్ జర్నలిస్టు దామెర రాజేందర్ రాసిన మరణ సందేశం పుస్తకాన్ని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య తాటికొండ రమేశ్ సోమవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆవిష్కరించారు. తొలుత జర్నలిస్టు గౌరీ లంకేష్ జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్య రమేశ్ మాట్లాడుతూ మరణ సందేశం పుస్తకం ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకమన్నారు.

ఈ కార్యక్రమంలో వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, సీనియర్ జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, అంతడుపుల శ్రీనివాస్, బండి మొగిలి, ప్రజాసంఘాల నాయకులు నల్లెల్ల రాజయ్య, రమేశ్‌రాజా, కోగిల చంద్రమౌళి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికలపై గురి

▸▸ 5వ పేజీ తరువాయి

నామమాత్రపు పోటీ ఇచ్చారు. అయితే ఆ ఎన్నికల్లో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన తీన్మార్ మల్లన్న, కోదండరాంలు ప్రస్తుతం కాంగ్రెస్‌కు మద్దతుగా ఉండడంతో ఈసారి ఎమ్మెల్సీ ఉప ఎన్నికను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. దీంతో ఈసారి భారీ ఎత్తున గ్రాడ్యుయేట్స్ ఓట్లను నమోదు చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాలు జారీ చేసింది. తన నియోజకవర్గ పరిధిలో సాధ్యమైనంత వరకు ఎక్కువ సంఖ్యలో గ్రాడ్యుయేట్ ఓట్లను నమోదు చేయాలని ఎమ్మెల్యేకు పార్టీ టాస్క్ ఇచ్చింది. పది రోజులుగా పట్టభద్రుల ఓట్ల కోసం ఎమ్మెల్యేలు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నారు.. బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాలైన ఎంపీ, ఎమ్మెల్సీ స్థానం దక్కించుకోవటంపై కాంగ్రెస్ దృష్టి పెట్టింది.

హనుమకొండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ఎన్‌పీడీసీఎల్) ఎట్టకేలకు ప్రక్షాళన మొదలైంది. గత పదేళ్లుగా పాతుకు పోయిన నలుగురు డైరెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్వాసన పలికింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్ఏఎం రిజ్వీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌పీడీసీఎల్‌తో పాటు టీఎస్ఎస్పీడీసీఎల్‌లోని ఏడుగురు డైరెక్టర్లను కూడా తొలగించారు. దీంతో ఒక్క కలంపోటుతో మొత్తం పదకొండు మంది డైరెక్టర్లు ఇంటిదారి పట్టారు. విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రక్షాళన చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించినట్టుగా ఆ దిశగా చర్యలు తీసుకున్నారు. ఇక వీటికి మంచి రోజులు వచ్చినట్టేనని విద్యుత్ వినియోగదారులు, వాటిలో పని చేస్తున్న ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 'ఎన్‌పీడీసీఎల్‌లో ప్రక్షాళన షురూ' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ఈనెల 16న ప్రత్యేకం కథనం వచ్చింది. చెప్పినట్టుగానే డైరెక్టర్ల తొలగింపు జరిగింది.

వేటు పడిన డైరెక్టర్లు

టీఎస్ఎన్‌పీడీసీఎల్‌లో వేటు పడిన డైరెక్టర్లలో బి.వెంకటేశ్వర్ రావు (హెచ్ఆర్), పి.మోహన్‌రెడ్డి (ప్రాజెక్టులు), పి.సంధ్యారాణి (కమర్షియల్), పి గణపతి (ఐపీసీ అండ్ ఆర్ఏసీ) ఉన్నారు. బి.వెంకటేశ్వర్ రావు మినహా మిగతా ముగ్గురు డైరెక్టర్ల నియామకం నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని ప్రిన్సిపల్ సెక్రెటరీ రిజ్వీ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నలుగురు నిబంధనలకు వ్యతిరేకంగా చాలా సంవత్సరాలుగా పని చేస్తున్నందు వల్లనే వారిని తొలగించినట్టు పేర్కొన్నారు. బి.వెంకటేశ్వర్ రావు (డైరెక్టర్ హెచ్ఆర్) 2013 జులై 31న నియమితులయ్యారు. 10 సంవత్సరాల 5 నెలల పాటు కొనసాగారు. వెంకటేశ్వర్ రావు 2007లో సీఈగా రిటైర్ అయ్యారు. ఆ తర్వాత అయిదేళ్లకు డైరెక్టర్ అయి అప్పటి నుంచి కొనసాగుతూ వస్తున్నారు. పి.మోహన్‌రెడ్డి (డైరెక్టర్ -పాజెక్టులు) 2018 సెప్టెంబరు 5 తేదీన నియమితులయ్యారు. 5 సంవత్సరాల 4 నెలలుగా ఆయన కొనసాగుతు న్నారు. ఈయన 2006లో సీఈగా రిటైర్ అయ్యారు. మోహన్‌రెడ్డికి 2009లో ఒక సారి, 2011లో రెండో సారి, 2018లో ముచ్చ టగా మూడో సారి ఎక్స్‌టెన్షన్ ఇచ్చారు.పి.సంధ్యారాణి (డైరెక్టర్-కమర్షియల్) 2018 సెప్టెం బరు 5న నియమితులయ్యారు. ఆమె కూడా 5 సంవత్సరాల 4 నెలలుగా కొనసా గుతున్నారు. ఈమే 2021లో సీఈగా రిటైర్ అయ్యారు. అయితే 2018 నుంచి ఇన్‌సర్వీస్ ఉద్యోగి హోదా లో డైరెక్టర్ గా కొనసాగుతూ వచ్చారు. అలాగే పి.గణపతి (డైరెక్టర్- ఐపీసీ అండ్ ఆర్ఏసీ) కూడా 2018 సెప్టెంబరు 5న నిమితులై గత 5 ఏళ్ళ 4 నాలుగు నెలలుగా కొనసాగుతు న్నారు. ఈయన 2014 ఆగస్టులో రిటైర్ కావలసి ఉన్నది. 2018 నుంచి ఇన్‌సర్వీస్ ఉద్యోగిగా డైరెక్టర్ హోదాలో కొనసాగుతూ వచ్చారు.



టీఎస్ఎన్‌పీడీసీఎల్‌లో ప్రక్షాళన

నలుగురు డైరెక్టర్లకు ఉద్వాసన

- జారీ అయిన ఉత్తర్వులు
- నిబంధనలకు విరుద్ధంగా నియమితులైనందుకే..
- ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్న ప్రభుత్వం
- కొత్త డైరెక్టర్ల నియామకానికి త్వరలో నోటిఫికేషన్



గత సీఎండీ గోపాల్‌రావుతో ప్రస్తుతం తొలగింప బడిన డైరెక్టర్లు

నాలుగేళ్లు మించకూడదు

సాధారణంగా ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్లుగా విద్యుత్ సంస్థల్లో సీఈ హోదాలో రిటైర్ అయిన వారిని లేదా ఇంకా రెండేళ్లలో రిటైర్ కానున్న ఇన్‌సర్వీస్ ఉద్యోగులను డైరెక్టర్లుగా నియమిస్తారు. డైరెక్టర్లను తొలుత రెండేళ్ల కాలపరిమితితో మాత్రమే నియమించాలి. ఆ తర్వాత అవసరాన్ని బట్టి వారి కాలపరిమితిని మరో ఏడాది పొడిగించవచ్చు. గరిష్టంగా రెండు సార్లు మాత్రమే వారికి ఎక్స్‌టెన్షన్ ఇవ్వాలి. ఏ డైరెక్టర్ అయిన నాలుగేళ్లకు మించి పని చేయరాదు. కానీ ఎన్‌పీడీసీఎల్‌లో ఇందుకు విరు ద్ధంగా డైరెక్టర్లకు ఇష్టారీతిన పొడిగింపులు ఇస్తూ వెళ్లారు. వెంకటేశ్వర్‌రావు (డైరెక్టర్-హెచ్ఆర్‌పి) గత పదేళ్లుగా కొనసాగుతున్నారు. ఆయన పదవీ కాలంలో నలుగురు సీఎండీలు మారారు. ఎన్‌పీడీసీఎల్‌లో మొత్తం అయిదుగురు డైరెక్టర్లలో ఈ నలుగురు పోను మరో డైరెక్టర్ (ఫైనాన్స్)గా ప్రస్తుతం చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం ఎకౌంట్స్)గా పని చేస్తున్న తిరుపతి రెడ్డి కొనసాగుతున్నారు. అయితే ఆయన ఇన్‌చార్జి డైరెక్టర్ మాత్రమే. అంతకు ముందు పని చేసిన డైరెక్టర్ పదవీ కాలం ముగియడంతో ఆయన బాధ్యతలను తిరుపతి రెడ్డికి అప్పగించారు.

టీఎస్ఎస్‌పీడీసీఎల్

తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డిస్ట్రిబూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ఎస్‌పీడీసీఎల్)లోనూ ప్రస్తుతం సుదీర్ఘ కాలం పాటు కొనసాగుతున్న మరో ఏడుగురు డైరెక్టర్లను కూడా తొలగిస్తూ రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు. జె.శ్రీనివాసరెడ్డి (డైరెక్టర్-ఆపరేషన్స్), టి.శ్రీనివాస్ (డైరెక్టర్-ప్రాజెక్టులు), కె రాములు (డైరెక్టర్ కమర్షియల్, డీపీఈ, అసెస్‌మెంట్ అండ్ ఎనర్జీ ఆడిట్), జి.పర్వతం (డైరెక్టర్-హెచ్ఆర్ అండ్ ఐఆర్) సీహెచ్ మదన్ మోహన్ (డైరెక్టర్ పీఅండ్ఎంఎం) ఎస్.స్వామిరెడ్డి (డైరెక్టర్-ఐపీసీ అండ్ ఆర్ఏసీ), గంపా గోపాల్ (డైరెక్టర్,ఈ ఆడిట్, డీపీఈ అండ్ అసెస్‌మెంట్) వీరిలో ఉన్నారు. వీరిలో జె.శ్రీనివాస్ రెడ్డి 9 సంవత్సరాలు 2 నెలలుగా, టి శ్రీనివాస్ 10 సంవత్సరాల 5 నెలలుగా కొనసాగుతున్నారు. మిగతా వారంతా 5 సంవత్సరాల 5 నెలలుగా పని చేస్తున్నారు. కొత్త డైరెక్టర్ల నియామకం త్వరలో జరగవచ్చునని తెలుస్తోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.

మహాజాతరను విజయవంతం చేద్దాం..

- అధికారులు, పూజారులు సమన్వయంగా పనిచేయాలి
- ఐటీడీఏ పీవో అంకిత్

మేడారం, జనవరి 29 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో జరిగే మహాజాతరను విజయవంతం చేసేందుకు అధికారులు, పూజారులు సమన్వయంగా పనిచేయాలని ఐటీడీఏ పీవో అంకిత్ అన్నారు. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు పూజారులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. దేవాదాయ శాఖ ఈవో రాజేందర్ ఆధ్వర్యంలో మేడారంలో ఈ సమావేశం జరిగింది. మహాజాతరను విజయవంతం చేయడా నికి చేపడుతున్న కార్యాచరణపై ఈ సందర్భంగా చర్చించారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూజారులు, అధికారులు సమన్వయంగా జాతరను విజయవంతం చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అంకిత్

పూజా కార్యక్రమాలు, వాటికి చేపట్టాల్సిన ఏర్పాట్లను పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావును అడిగి తెలుసు కున్నారు. కొండాయి నుంచి గోవిందరాజులు, పొనుగొండ్ల నుంచి లక్ష్మీపురం మీదుగా పగిడిద్దరాజును తీసుకొచ్చే సమయంలో పోలీసు రోప్ పార్టీల ద్వారా భద్రత కల్పించేందుకు డీఎస్పీ స్థాయి అధికారితో సమన్వయం చేసుకోవాలన్నారు. చిలుకలగుట్ట నుంచి సమ్మక్క, కన్నెపల్లి నుంచి సారలమ్మ అమ్మవార్లను తీసుకొచ్చే సమయంలో మూడంచల భద్రత అవసరం ఉంటుందన్నారు. వనదేవతల పూజారులకు ఎండోమెంట్ ద్వారా శాశ్వత గదులు కేటాయించాలన్నారు. దేవస్థానం కోసం కేటయించిన స్థలంలో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. పూజారులకు వసతి, సౌకర్యాలు కల్పిస్తామని, వారి సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఏపీవో వసంతరావు, ఎస్‌వో రాజ్‌కుమార్, పూజారులు వెంకటేశ్వరు, గోవర్ధన్, ప్రభకర్, నర్సింగరావు, భోజరావు, రమేష్, రాజేశ్వర్, పూర్ణచందర్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖ సన్నద్ధం : ఎస్పీ శబరీశ్

ములుగు, జనవరి 29: మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరను విజయవం తంగా జరిపించేందుకు పోలీసు శాఖ సన్నద్ధమ వుతోందని ములుగు ఎస్పీ శబరీశ్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ భద్రతా చర్యలు చేపడతామని అన్నారు. ములుగులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. కుంభమేళా స్థాయిలో జరిగే మేడారం జాతర నిర్వహణ బాధ్యత పోలీసు శాఖ ద్వారా తనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడతామ న్నారు. గత జాతర సమయంలో తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా చూసుకుంటామని అన్నారు. ప్రధానంగా ట్రాఫిక్, భక్తులు, వీఐపీల రక్షణపై దృష్టి సారించామని తెలిపారు. సాధ్యమైనంత తవరకు పార్కింగ్ స్థలాలను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. జాతర నిర్వహణలో ప్రజలు పోలీసు శాఖకు సహకారం అందించాలని ఆయన కోరారు.





దరఖాస్తు ఫారాలను అందజేస్తున్న పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

ఓటరు నమోదును వేగవంతం చేయాలి

వరంగల్ సిటీ, జనవరి 29: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండలోని పీఆర్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఓటరు దరఖాస్తు ఫారాలను ఆయన పట్టభద్రులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ... త్వరలో జరుగనున్న ఖమ్మం, నల్లగొండ వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యుల్లోని పట్టభద్రులందరు ఓటు నమోదు ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులకు దరఖాస్తు ఫారాలను అందజేశారు. పీఆర్టీయూ ఉమ్మడి జిల్లా నాయకులు తిరుపతిరెడ్డి, శ్రీహరి, రవీందర్‌రెడ్డి, అబ్దుల్ గఫార్, ఉపేందర్‌రెడ్డి, రాజు, అశోక్‌రావు, రాజు, చంద్రమోహన్, రమేష్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, విష్ణుమూర్తి, రాజేందంర్‌రెడ్డి, సోమేశ్వరశర్మ, శ్రీనివాస్‌రెడ్డి, మనోహర్‌రావు, రఘుపతి పాల్గొన్నారు.

యాసంగి వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వరంగల్ సిటీ, జనవరి 29: ఉమ్మడి వరంగల్ జిల్లాలో సాగుచేస్తున్న యాసంగి వరిలో కాండం తొలుచు పురుగులు, రెక్కల పురుగుల ఉధృతి పెరుగుతుండటంతో రైతులు తీసుకోవాల్సిన పలు సస్యరక్షణ చర్యలను వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ బి.దిలీప్‌కుమార్, యు. నాగభూషణం, ఎం.విశ్వతేజ క్షేత్రస్థాయిలో రైతులకు వివరించారు. సోమవారం ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి వరి పొలాలు, నారుమళ్లలో క్షేత్రస్థాయి పర్యటనలు చేసి రైతులకు సలహాలు, సూచనాలు అందజేశారు. పురుగుల ఉధృతిని గమనిం చడానికి దీపపు ఎర, సోలార్ ఎర, లింగార్షక బుట్టలను ఏర్పాటు చేసి నిఘా పెట్టాలన్నారు. వరి పిలక దశలో ఎకరాకు మూడు లింగార్షక బుట్టలు ఏర్పాటు చేసి అందులో వారానికి బుట్టలో 25-30 పురుగులు పడినప్పుడు పంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.



నారాయణగిరిలోని పంట పొలాల్లో రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

నేడు కేయూలో ప్రాంగణ నియామకాలకు ఇంటర్వ్యూలు

కేయూ క్యాంపస్, జనవరి 29: కేయూ కెమిస్ట్రీ విభాగంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు హైదరాబాద్‌లోని లురుస్ ల్యాబ్ రిసెర్చ్ అనలిస్టులుగా పనిచేసేందుకు ప్రాంగణ నియామకాలు చేపడుతున్నట్లు కేయూ కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.సవితాజ్యోత్స్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24లో ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ/అనలిటికల్ కెమిస్ట్రీ, ఎంఫార్మసీ క్వాలిటీ అనలటిక్స్/ఫార్మా అనలటిక్స్ పూర్తి చేసిన వారు ప్రసుత్తం చదువుతున్న వారు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్‌లో పనిచేయాలని, ఏడాదికి రూ. 2.50 లక్షల వేతనం ఉంటుందని తెలిపారు. బయోడెటా, పాస్‌పోర్టు సైజ్ ఫోటో, అకాడమిక్ ధృవపత్రాలు, సంబంధిత కళాశాల ఐడీ కార్డుతో నేరుగా ప్రాంగణ నియామకాలకు హాజరుకావాలని కోరారు.

పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ ఫీజు గడువు 12

కేయూ క్యాంపస్, జనవరి 29 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంటీఎం, ఎంహెచ్ఆర్ఎం, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్‌తో పాటు ఇతర పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షల ఫీజును ఫిబ్రవరి 12 వరకు అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ సుంకరి జ్యోతిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 250 అపరాధ రుసుంతో ఫిబ్రవరి 15 వరకు గడువు ఉందని తెలిపారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని పేర్కొన్నారు.



ముల్కనూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను ప్రశ్నిస్తున్న అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా

టీచర్‌గా మారిన అడిషనల్ కలెక్టర్

- పాఠ్యపుస్తకాల్లోని అంశాలపై ప్రశ్నలు

భీమదేవరపల్లి, జనవరి 29 : జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా టీచర్ అవతారం ఎత్తారు. సోమవారం ముల్కనూర్ ప్రాథమిక పాఠశాలను అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధ శుక్లాలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఐదో తరగతి విద్యార్థులను తెలుగు, గణితంలో వివిధ ప్రశ్నలు అడిగారు. అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు తడబాటుకు గురయ్యారు. దీంతో ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని సూచనలు చేశారు. విద్యార్థులు పదో తరగతి తర్వాత ఉద్యోగ లక్ష్యం దిశగా ఎంచుకొని అందుకు తగ్గట్టు చదువుకోవాలని సూచించారు. అలాగే పాఠశాలలో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ముల్కనూర్ ప్రాథమిక పాఠశాలలో నిర్మిస్తున్న భవనానికి నిధులు రాలేదని కాంట్రాక్టర్లు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మారెడ్డిలు అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా బిల్లులు వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. అనంతరం భీమదేవరపల్లిలోని గ్రంథాలయాన్ని పరిశీలించి, పోటీ పరీక్షలకు చదువుకునే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను అందులో ఏర్పాటు చేయాలని లైబ్రేరియన్ వాగు శివాజీకి సూచించారు. ఎంపీడీవో భాస్కర్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ కొంరయ్య, విద్యా కమిటీ చైర్మన్ పూర్ణచందర్, ముల్కనూర్ ఈవో పూర్ణచందర్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై మేడారం భక్తులకు అవగాహన


సీపీఆర్‌పై అవగాహన చేస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

మేడారం, జనవరి 29: వనదేవతలను దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై సోమవారం అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చిన వ్యక్తిని ఎలా రక్షించాలో ఈ విధానం ద్వారా డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య వివరించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీపీఆర్ విధానంపై ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా అవగాహన ఉండాలని తెలిపారు. ఈ విధానం ద్వారా ప్రాణాలను కాపాడొచ్చని తద్వారా ఒక కుటుంబాన్ని నిలబెట్టిన వాళ్లమవుతామని అన్నారు. డీఎంహెచ్‌వో అప్పయ్య మాట్లాడుతూ ఎవరైనా హఠాత్తుగా గుండెపోటుకు గురై సొమ్మసిల్లి పడిపోతే వెంటనే సీపీఆర్ విధానం ద్వారా వారి ప్రాణాలను కాపాడొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో నాగపద్మజ, డీడబ్ల్యూవో ప్రేమలత, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవి, పలు పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వనదేవతలను దర్శించుకున్న మాజీ కేంద్ర మంత్రి

మేడారం వనదేవతలను మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాం నాయక్ దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పూజారుల, అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. తల్లుల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూలు, పండ్లు, పసుపు కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం సమర్పించారు. ఈ సందర్భంగా బలరాం నాయక్ మాట్లాడుతూ మహా జాతరకు తరలివచ్చే భక్తకోటి సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం మేడారంలో అనేక అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. ఇందుకు రూ. 75 కోట్లు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సిరి సంపదలు కలిగి ఉండాలని వనదేవతలను కోరుకున్నానని తెలిపారు. ఆయన వెంట ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోరిక ఈశ్వర్ సింగ్, కాంగ్రెస్ ఎస్టీ సెల్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బానోత్ నవీన్ నాయక్, తాడ్వాయి మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ నాయకులు తదితరులు ఉన్నారు.


వనదేవతలను దర్శించుకుంటున్న బలరాం నాయక్

ప్రత్యామ్నాయ రహదారుల పనులు పూర్తి చేయాలి

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఏటూరునాగారం రూరల్, జనవరి 29: వచ్చే నెలలో జరుగనున్న మేడారం మహాజాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు చేపట్టాలని, ప్రత్యామ్నాయ రహదారుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం మండలంలోని కొండాయిలో ఆమె అధికారులతో కలిసి పర్యటించారు. కొండాయిలోని గోవింద రాజుల ఆలయాన్ని దర్శించుకున్నారు. అదేవిధంగా గ్రామంలోని జంపన్నవాగుపై చేపడుతున్న రహదారి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతోపాటు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, తదితర జిల్లాల నుంచి భక్తులు మేడారానికి చిన్నబోయినపల్లి, కొండాయి, ఊరట్టం మీదుగా చేరుకుంటారని, ఈమార్గంలో రోడ్డు పనులను పటిష్టంగా చేపట్టాలన్నారు. ఈరహదారి వెంట అధికసంఖ్యలో ప్రైవేట్ వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. ఈరహదారిపై జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బం దులు కలుగకుండా తాగునీటి సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కొండాయిలోని గోవిందరాజుల ఆలయానికి ప్రత్యేక నిధులు కేటాయించి మొక్కులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మహా జాతరలో కొండాయి నుంచి గోవిందరాజులను మేడారానికి తీసుకెళ్లే మార్గంలో పూజారులు, భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్ల కలెక్టర్ పేర్కొన్నారు. ఆమె వెంట జిల్లా ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో అంకిత్, ఏఎస్పీ సంకీర్త్, ఏపీవో వసంతరావు, ఎస్‌వో రాజ్‌కుమార్, కొండాయి సర్పంచ్ కాక వెంకటేశ్వర్లు ఉన్నారు.


కొండాయిలో గోవిందరాజుల ఆలయం వద్ద వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య


రాజు మృతదేహం

వెంకటాపూర్(రామప్ప), జనవరి 29: ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఉరేసు కొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గుంటూ రుపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఎస్సై చల్ల రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని కన్నవేన రాజు(25) రామాంజాపూర్ గ్రామానికి చెందిన కావ్యశ్రీని నాలుగేళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. వారికి పాప జన్మించింది. పాప అనారోగ్యం కారణంగా అప్పులు చేశాడు. రాజు డ్రైవర్‌గా పనిచేస్తున్న క్రమంలో ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదానికి గురికావడంతో కాలు విరిగింది. దీంతో కుటుంబ పోషణ భారంగా మారి మరింత అప్పులు పెరిగిపోయాయి. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మనస్తాపం చెందిన రాజు ఆదివారం అర్ధరాత్రి ఇంటి ముందు ఉన్న చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

బావిలో దూకి మహిళ..

రేగొండ, జనవరి 29: బావిలో దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రేపాక గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇండ్ల కొమురమ్మ(65) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. సోమవారం ఉదయం ఇంట్లోంచి వెళ్లిపోయి గంజి సుధాకర్ అనే రైతు వ్యవసాయ బావిలో దూకింది. కొమురమ్మ కుటుంబ సభ్యులు వెతకగా బావిలో ఆమె మృతదేహం లభ్యమైంది. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరకాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని ఎస్సై రవికుమార్ తెలిపారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 29: అకింతభావంతో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. సమీకృత కలెక్టరేట్‌లో నూతనంగా రెగ్యులరైజ్ అయిన 87 మంది స్టాఫ్ నర్సులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెగ్యులరైజ్ చేసిన 87 మంది స్టాఫ్ నర్సుల్లో 17 మంది పురుషులు, 77 మంది మహిళలు ఉన్నరన్నారు. రెగ్యులరైజ్‌కు ఎంపికైన స్టాఫ్ నర్సులకు ఈనెల 31న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా హైదారాబాద్‌లో నియామకపత్రాలను అందించనున్నట్లు తెలిపారు. స్టాఫ్ నర్సులను హైదారాబాద్‌కు తీసుకువెళ్లేందుకు ఈనెల 31 జిల్లా కేంద్రం నుంచి 3 ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వైద్యరంగంలో సేవలు అందించడం అదృష్టంగా భావించాలన్నారు. ఈసందర్భంగా స్టాఫ్ నర్సులకు కలెక్టర్ భవేష్ మిశ్రా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో మధుసూదన్ శుభాకాంక్షలు తెలిపారు.

అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలి

చిట్యాల, జనవరి 29: అర్హులైన నిరుపేదలను గుర్తించి వెంటనే వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చింతల రజినీకాంత్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ ఈ మేరకు సోమవారం వినతిపత్రం అందజేశారు. రెండుసార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్‌కార్డులు మంజూరు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నూతన రేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలన్నారు.

టీపీటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయండి


మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

మొగుళ్లపల్లి, జనవరి 29: ఖమ్మంలో ఫిబ్రవరి 11,12 తేదీల్లో జరిగే తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర ద్వితీయ విద్యా, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గువ్వాడి జగపతిరావు కోరారు. స్థానిక ఎంఈవో కార్యాలయం ఆవరణలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎంఈవో విప్రభాకర్ చేతుల మీదుగా మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా జగపతిరావు మాట్లాడుతూ 'అంతరాలు లేని విద్య.. ప్రజల హక్కు.. ప్రభుత్వ బాధ్యత' ప్రధాన అంశంగా మహాసభలు జరుగనున్నాయని తెలిపారు. సమానత్వ విద్య, ఫాసిజం బుద్ధిజీవుల పాత్ర, మహిళల స్థితిగతులు, కర్తవ్యాలు, ప్రభుత్వ విధానాలు, ఆర్థిక సంక్షోభం అనే అంశాలపై ప్రొఫెసర్లు హరగోపాల్, కాశీం, బుర్ర రమేష్, ఎ.నరసింహారెడ్డి, చందన చక్రవర్తి, వేణుగోపాల్‌లు ప్రసంగించనున్నారని అన్నారు. ఈ మహాసభలకు మండలంలోని ఉపాధ్యాయులు, మేధావులు, విద్యా అభిమానులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.జయపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల తల్లిదండ్రులు ఆత్మస్థైర్యాన్ని కలిగి ఉండాలి

ములుగు కలెక్టరేట్, జనవరి 29: ఆడపిల్లలు కన్న తల్లిదండ్రులు ఆత్మస్థైర్యం కలిగి ఉండాలని మహిళా సంక్షేమ శాఖ జిల్లా అధికారి ప్రేమ లత అన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క తల్లిదండ్రులు సమ్మక్క, సమ్మయ్యలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సీతక్క స్వగ్రామమైన ములుగు మండలంలోని జగ్గన్నపేటలో వరంగల్‌కు చెందిన అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో ఆడపిల్లల తల్లిదండ్రులకు సన్మాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రేమలత హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతక్క తల్లిదండ్రులను సన్మానించారు. నేటి సమాజంలో మహిళల పట్ల వివక్ష చూపుతున్న పరిస్థితుల్లో మంత్రి సీతక్క తల్లిదండ్రులు తమ బిడ్డను ఉన్నత స్థానాలకు తీసుకెళ్లడానికి అహర్నిషలు శ్రమించారని ప్రేమలత కొనియాడారు. జాతీయ యువజన అవార్డు గ్రహీత మండల పరశురాములు మాట్లాడుతూ తమ సంస్థ అభ్యుదయ సేవా సమితి ద్వారా ఆడపిల్లలకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను అక్కున చేర్చుకుని ఆత్మీయ సన్మానం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆడపిల్లల పట్ల వివక్ష చూపకుండా బాలురకు సమానంగా అవకాశాలు కల్పిస్తే అభివృద్ధి సాధిస్తారని అన్నారు. సంస్థ గౌరవ అధ్యక్షుడు మడుగూరి నాగేశ్వర్‌రావు, సామాజికవేత్త ఎమ్డీ.ఇక్బాల్ పాషా, గ్రామపెద్దలు వెంకన్న, శ్యామ్, శ్రీనివాస్, బత్తిని సాంబయ్య, గురువారెడ్డి, ఆరెందుల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.


మంత్రి సీతక్క తల్లిదండ్రులు సమ్మక్క సమ్మయ్యలను సన్మానిస్తున్న సేవా సమితి సభ్యులు

మన్విత్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

వెంకటాపురం(నూగూరు), జనవరి 29: పాలెం ప్రాజెక్టు కాల్వలో పడి మృతిచెందిన మండలంలోని ఒంటిమామిడి గ్రామంలో గల మన్విత్ కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి డిమాండ్ చేశారు. సోమవారం మండలకేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మన్విత్ మృతికి కారణమైన పాలెం ప్రాజెక్టు అధికారులపై చర్యలు తీసుకోవడంతోపాటు ఒంటిమామిడి ప్రజలు కాల్వ దాటేందుకు బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో నాయకులు కణితి వెంకటకృష్ణ, మట్టి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి వినతులు పరిష్కరించాలి : అదనపు కలెక్టర్


గోదావరి కరకట్ట వివరాలు అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ములుగు కలెక్టరేట్, జనవరి 29: వివిధ సమస్యలపై ప్రజలు ప్రజావాణిలో అందజేసిన వినతులను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీజ సంబంధితశాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం జరగగా ఆవె ప్రజల నుంచి 16 వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా శ్రీజ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఐవో అప్పలనాయుడు, విద్యుత్‌శాఖ డీఈ నాగేశ్వర్‌రావు, చీఫ్ ప్లానింగ్ అధికారి ప్రకాష్, బీసీ వెల్ఫేర్ అధికారి లక్ష్మణ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీఎస్‌వో సర్దార్‌సింగ్, సివిల్ సప్లయ్ అధికారి అరవిందరెడ్డి, డీఎం రాములు, మత్స్యశాఖ అధికారి శ్రీపతి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

గోదావరి కరకట్ట పరిశీలన

ఏటూరునాగారం రూరల్: మండలంలోని రామన్నగూడెం వద్ద కోతకు గురవుతున్న గోదావరి కరకట్టను ములుగు అదనపు కలెక్టర్ పి.శ్రీజ సోమవారం పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులతో కలిసి పర్యటించారు. వర్షాకాలంలో వచ్చిన వరదలకు గోదావరి కరకట్ట రామన్నగూడెం వద్ద కొంతమేర తెగిందని, దానికి తాత్కాలిక మరమ్మతు పనులను చేపట్టామని ఇరిగేషన్ ఈఈ జగదీశ్ వివరించారు. శాశ్వత నిర్మాణాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని ఇంజనీరింగ్ అధికారులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈసదర్భంగా అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ వీలైనంత త్వరగా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పనులు చేపట్టేందుకు కృషి చేస్తానని అన్నారు. ఆమె వెంట జడ్పీ సీఈవో ప్రసూనరాణి, ఎంపీడీవో కుమార్, జడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ ఉన్నారు.

మృతుల కుటుంబాలకు పోలీసుల చేయూత


అంజిత్ భార్యా పిల్లలకు సాయం అందజేస్తున్న సీఐ రంజిత్‌కుమార్, ఎస్సై వెంకటేశ్వర్

ములుగు కలెక్టరేట్, జనవరి 29: గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రమా దవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన ములుగు పట్టణంలోని ఎస్సీకాలనీకి చెందిన బోడ అంజిత్‌కుమార్, ల్యాడ విజయ్ కుటుంబాలకు ములుగు పోలీసులు చేయూతను అందించారు. సీఐ మేకల రంజిత్‌కుమార్, ఎస్సై వెంకటేశ్వర్ బాధిత కుటుంబాలను సోమవారం పరామర్శించి ఒక్కో కుటుంబానికి 25కిలోల బియ్యంతోపాటు రూ.3,500 చొప్పున ఆర్థికసాయం అందజేశారు ఈసందర్భంగా సీఐ రంజిత్‌కుమార్ మాట్లాడుతూ ఆపదకాలంలో సాటి మనుషులను ఆదుకోవాలని, కూలీ పనులు చేస్తూ జీవించే ఇరు కుటుంబాలకు దాతలు ముందుకు వచ్చి సహకారం అందించాలని కోరారు. ప్రమాదాలు సంభవించినప్పుడు కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, పిల్లలకు మంచి చదువులు చెప్పించాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కాలనీవాసులు మండల ప్రవీణ్, గుగ్గిళ్ల సృజన్, కోగిల మహేష్, మేడిపల్లి శ్రీకాంత్, జంగయ్య, శ్రవణ్, పూర్ణ, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకోవద్దు

కన్నాయిగూడెం, జనవరి 29 : బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని చైల్డ్ హెల్ప్‌లైన్ ములుగు జిల్లా కోఆర్డినేటర్ నరేష్ అన్నారు. పిల్లలను పనుల్లో పెట్టడం చటరీత్యా నేరమన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఏటూరు గ్రామ పరిధి మిరప తోటల్లో సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 14 ఏళ్లలోపు కూలి పనులు చేస్తున్న 11 మంది బాలురు, 15 మంది బాలికలను మొత్తం 26 మందిని గుర్తించారు. పిల్లలతో పనులు చేయించుకోవడం నేరమని వారి తల్లిదండ్రులు, రైతులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పిల్లలు అత్యవసర సమయంలో టోల్‌ఫ్రీ నంబరు 1098కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ విక్రం, రాణి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


కవితకు ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

టేకుమట్ల, జనవరి 29: మండలంలోని రాఘవరెడ్డిపేట గ్రామానికి చెందిన తూముల రమేష్ ఇటీవల గుండెపోటుతో మరణించగా ఆయన కుటుంబాన్ని పలువురు పరామర్శించారు. మృతుడి భార్య కవిత పదో తరగతి తోటి పూర్వ విద్యార్థులు రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. భవిషత్తులో కూడా కవిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూనాల మహేందర్, ముష్క రాజ్‌కుమార్, అచ్చ మహేందర్, చిక్కుల ప్రమోద్, మ్యాదరి రాజేందర్, పావుశెట్టి అశోక్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్స్ కార్యవర్గం ఎన్నిక


ప్రభురెడ్డి

మొగుళ్లపల్లి, జనవరి 29: ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ సీడ్స్ అసోసియేషన్ మండల నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏలేటి ప్రభురెడ్డి, ఉపాధ్యక్షులుగా పేర్వాల శ్రీనివాస్, లాండ్యే శ్రీదర్, ప్రధాన కార్యదర్శిగా లింగంపల్లి తిరుపతి, కోశాధికారిగా జీవన్, ప్రచార కార్యదర్శిగా దార్ల శివాజీ ఎన్నికయ్యారు.

నాయకపోడ్‌లను ప్రభుత్వం ఆదుకోవాలి

- మంగపేట, జనవరి 29: నాయకపోడ్ కులస్తులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కాపుల సమ్మయ్య కోరారు. మండల కేంద్రంలోని జేఎస్ఆర్ కాంప్లెక్స్‌లో సంఘం మండల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం సంఘం నాయకుడు పెద్ది సతీష్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా కాపుల సమ్మయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడారం జాతరలో నాయకపోడ్‌లకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చాద శేఖర్(మంగపేట), మండల ప్రధాన కార్యదర్శిగా లొట్టి వెంకటనారాయణ (తిమ్మంపేట), ఉపాధ్యక్షుడిగా గోపాల లక్ష్మణ్ (బోరునర్సాపురం), ప్రచార కార్యదర్శిగా పోలం తిరుపతి (గంపోనిగూడెం), కోశాధికారిగా పెద్దల నరేశ్ (కమలాపురం), కార్యవర్గ సభ్యులుగా జి.నరేష్, పి.నరేష్, ఎస్.రాము, పి.అశోక్, జి.నవీన్, పి.భరత్, పి.శ్రీను, చింతకుంట్ల విజయ్, గారే వెంకట్రాం, సింగ రాము, బి. వెంకటేశ్, జి. పుల్లయ్య ఎన్నికయ్యారు.

నిరుద్యోగులు ఎంప్లాయిూమెంట్ కార్డు పొందాలి

- అవగాహన సదస్సులో జిల్లా అధికారి కుమారస్వామి

ములుగు కలెక్టరేట్, జనవరి 29: జిల్లాలోని 50ఏళ్లలోపు నిరుద్యోగులు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎంప్లాయిమెంట్ కార్డు పొందాలని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ఇ.కుమారస్వామి అన్నారు. ములుగులోని డీఎల్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం అవగాహన సదస్సు జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. ములుగు జిల్లాలో రెండు ఎంప్లాయిమెంట్ కార్యాలయాలు ఉన్నాయని, అందులో ఏటూరునాగారంలో ఎస్టీ నిరుద్యోగుల కోసం, రెండో ములుగులో ఎస్సీబీసీ, మైనారిటీ నిరుద్యోగుల కోసం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం నిరుద్యోగ యువతకు సర్టిఫికెట్లు, బ్యాగులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఏపీపీసీ రాష్ట్ర బాధ్యుడు నసీర్ సిద్ధికి, జేఎస్ఎస్ డైరెక్టర్ ఖాజా మసియుద్దీన్, పూర్వ ఏపీపీసీ పూర్వ వరంగల్ కోఆర్డినేటర్ షఫీర్ రెహమాన్, ఉమ్మడి జిల్లా సంయుక్తకర్త, సామాజిక న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు యేషబోయిన సాంబయ్య, సామాజిక లంబాడా న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ధరావత్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు పాల్తియా శ్యాంనాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద రహిత బొగ్గు ఉత్పత్తిని సాధించాలి

గణపురం, జనవరి 29: ప్రమాద రహిత బొగ్గు ఉత్పత్తిని సాధించాలని సింగరేణి ఏరియా జీఎం బళ్లారి శ్రీనివాసరావు అన్నారు. సంస్థ యాజమాన్యం రూపొందించిన క్యాలెండర్‌ను ఆయన కాకతీయ లాంగ్‌వాల్ ప్రాజెక్టు వద్ద ఆవిష్కరించారు. కేఎల్‌పీ-8 ఇన్‌క్లైన్ పనితీరును, ఓపెన్‌కాస్టు-3 బొగ్గు ఉత్పత్తి, భూసేకరణ, ఉత్పత్తి లక్ష్యాల గురించి వివరించారు. పని ప్రదేశంలో అధికారులు, ఉద్యోగులు సమష్టిగా రక్షణ చర్యలు పాటించాలన్నారు. అంతేకాకుండా భూ సేకరణ ప్రక్రియలో ఏమైనా సమస్యలు ఉంటే స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రభావిత ప్రాంతమైన కొండంపల్లి తరలింపునకు సంబంధించిన ప్రణాళిక కూడా సిద్ధం చేస్తున్నామన్నారు. సింగరణి అధికారులు వెంకటయ్య, ఎస్.వి.రావు, తుకారాం, భానుప్రసాద్, సాయికృష్ణ పాల్గొన్నారు.

స్కూల్ బస్ డ్రైవర్లకు కౌన్సెలింగ్

గణపురం, జనవరి 29: ప్రైవేటు పాఠశాల బస్ డ్రైవర్లకు ఎస్సై సాంమూర్తి సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిం చాలన్నారు. సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలించొద్దని అన్నారు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటాయని వివరించారు. డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలన్నారు.

సమగ్రాభివృద్ధికి కృషి చేద్దాం : ఎంపీపీ

కాటారం, జనవరి 29: మండలాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లి సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. మండలంలోని వీరాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో రూ.40.80 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో నిర్మించిన జీపీ, అంగన్‌వాడీ సెంటర్ భవనాలను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎంపీపీ సోమవారం ప్రారంభిం చారు. మరో మూడు రోజుల్లో పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో ప్రత్యేకాధికారులు గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ వేమునూరి రమేష్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు తెప్పల దేవేందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, డీడబ్ల్యూవో నాగేశ్వర్‌రావు, ఎంపీడీవో శంకర్‌నాయక్, సీడీపీవో రాధిక, ఎంపీవో ఉపేంద్రయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వీణ, అరుణ, మమత, శివరాణి, నాగరాణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రాలను మరో 15 రోజులు కొనసాగించాలి

కాటారం, జనవరి 29: పత్తి విక్రయాలకు రైతులు ఇబ్బందులు పడకుండా కేంద్ర ప్రభుత్వం సీసీఐ కేంద్రాలను మరో 15 రోజులు కొనసాగించాలని కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు వొన్న వంశవర్ధన్ రావు, మండల అధ్యక్షుడు తోడె మాధవరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ పలు గ్రామాల పరిధిలో చేన్లలోనే పత్తి తీయకుండా ఉన్నప్పటికీ ఈ నెల 31తో సీసీఐ కేంద్రాల్లో కొనుగోలు బంద్ చేస్తామని అధి కారులు ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. మండలంలోని రుద్ర జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలో పూర్తిస్థాయిలో పత్తి కొనుగోళ్లు జరగనేలేదని ఆరోపించారు. మండలంలో సుమారు 15వేలకు పైగా ఎకరాల్లో పత్తి సాగు చేయగా లక్షకు పైగా క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందన్నారు. ఇప్పటి వరకు 30వేల క్వింటాళ్ల పత్తి మాత్రమే సీసీఐ కొనుగోలు చేసిందని, మరో 15రోజులు కేంద్రాన్ని నడిపిస్తే రైతులకు కనీస మద్ధతు ధరలు లభిస్తాయన్నారు.